

బలగ కాలభైరవాలయంలో మహిళల సామూహిక కుంకుమార్చనలు




దుర్గాదేవి అవతారంలో మహాలక్ష్మి అమ్మవారు

ఓంకార రూపిణి.. శక్తి ప్రదాయిని..!

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఆలయాలు, దేవీ పీఠాల్లో గురువారం దుర్గాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ధనలక్ష్మిగా నీలమణిదేవి



సారవకోట మండలం అవలంగి గ్రామంలో నీలమణిదేవి అమ్మవారు గురువారం భక్తులకు ధనలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా జగన్మాతను రూ.2 లక్షలు విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించినట్లు ప్రధాన అర్చకుడు చల్లపల్లి బాస్కరరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, సారవకోట

భారత రతన్‌ం.. మీ సేవలు అమరం



దిగ్గజ పారిశ్రామిక వేత్త, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మృతికి సిక్కోలు వాసులు ఘన నివాళులర్పించారు. శ్రీకాకుళం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఏడు రోడ్ల కూడలిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నటుకుల మోహన్, బాడాన దేవభూషన్, ప్రసాద్, మనోజ్, రవి, తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

ప్రగతి దారిలో పల్లె ప్రయాణం..!

- రూ.261.84 కోట్లతో 3,471 పనులకు పరిపాలన ఆమోదం
- 14 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో శంకుస్థాపనలు

వైకాపా నిర్వాకంతో గత ఐదేళ్లూ పల్లెల్లో అభివృద్ధి పడకేసింది. పంచాయతీల నిధులను దారి మళ్లించడంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారు. గ్రామీణ ప్రాంతాలు అంధకారంలోకి వెళ్లిపోయాయి. వాటిని ప్రగతి బాట పట్టించేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. 'పల్లె పండగ' పేరుతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం మేరకు ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లాలోనూ రూ.261.84 కోట్లతో 3,471 పనులకు పరిపాలన ఆమోదం లభించింది. – ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

జిల్లావ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 'పల్లె పండగ' నిర్వహించనున్నారు. ఆ రోజుల్లో 8 నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు ఎంపిక చేసిన పనులకు శంకుస్థాపనలు చేసి ప్రారంభిస్తారు. కార్యక్రమంలో ప్రధానంగా రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, ఇతర వసతులు కల్పించనున్నారు. ఉపాధి పథక నిధులతో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ప్రజలే నిర్ణేతలు.. మారనున్న రూపురేఖలు..

వైకాపా హయాంలో గ్రామాల అభివృద్ధికి రూపాయి కూడా కేటాయించలేదు. కూటమి ఏర్పడిన నాలుగు నెలల్లోనే దీనిపై దృష్టి సారించింది. జిల్లాలో ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు తెలిపిన సమస్యల ఆధారంగా పనులను ఎంపిక చేశారు. ఎక్కువగా రహదారులు, మురుగు వ్యవస్థపై పెద్ద ఎత్తున వినతులు రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించి వాటికే ప్రాధాన్యమిచ్చారు. ప్రతి గ్రామంలో సీసీ, తారు, డబ్ల్యూబీఎం రోడ్లతో పాటు పర్యాటక వృద్ధికిగాను తీర ప్రాంతాలను కలుపుతూ దారులు వేయనున్నారు.

మంత్రి నియోజకవర్గానికే అగ్రతాంబూలం..

జిల్లాలో తలపెట్టిన పనుల్లో అధికశాతం మంత్రి నియోజకవర్గం టెక్కలికే కేటాయించారు. రూ.65.39 కోట్లతో 830 పనులు చేయనున్నారు. ఇతర నియోజకవర్గాల్లో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువ పనుల మంజూరుతో మంత్రి అచ్చెన్నాయుడు తన మార్కును చూపించుకున్నారు. నందిగాం మండలంలో రూ.14.37 కోట్లు, టెక్కలి రూ.15.34 కోట్లు, కోటబొమ్మాళికి రూ.14.90 కోట్లు, సంతబొమ్మాళి మండలంలో రూ.20.77 కోట్లకు ప్రతిపాదనలు పంపారు తర్వాత స్థానాల్లో ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, పాతపట్నం ఉన్నాయి. అత్యల్పంగా నరసన్నపేట నియోజకవర్గం ఉంది. అన్నిచోట్లా వందల సంఖ్యలో ఉంటే నరసన్నపేటలో మాత్రం 86 అభివృద్ధి పనులకే ప్రతిపాదనలు రూపొందించడం గమనార్హం.



గార మండలం అంపోలు గ్రామంలో రహదారి, కాలువల నిర్మాణం జరగనున్న తంగి వీధి

యుద్ధప్రాతిపదికన చేయిస్తాం..

పల్లె పండగ కార్యక్రమానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశాం. గ్రామాల్లో రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి ఎలాంటి ఇసుక కొరత లేదు. సిమెంట్‌కు సంబంధించి డీలర్లతో మాట్లాడుతున్నాం. పనులు యుద్ధప్రాతిపదికన జరిగేలా చూస్తాం.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

జిల్లాలో వివరాలు ఇలా...

నియోజకవర్గం	శ్రీకాకుళం	ఆమదాలవలస	ఎచ్చెర్ల	నరసన్నపేట	టెక్కలి	ఇచ్ఛాపురం	పలాస	పాతపట్నం
మంజూరైన పనులు	444	386	375	86	830	624	303	423
నిధులు (రూ.కోట్లలో)	32.54	39.99	20.93	24.10	65.39	29.42	27.52	21.93

16 నాటికి వివరాలు తెలియజేయండి: జేసీ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు ఈ నెల 16 నాటికి తెలియజేయాలని రెవెన్యూ అధికారులను జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల ప్రస్తుత స్థితిగతులు చెప్పాలన్నారు. ఈ విషయమై ఆర్డీవోలు తమ పరిధిలోని తహసీల్దార్లతో సమీక్షించి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలకు భూములు కేటాయించినప్పటికి ఇప్పటి వరకు వాటికి అప్పగించకుంటే తక్షణమే అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడుకోవాల్సిన భాద్యత సంబంధిత శాఖలదేనని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో ఎం.అప్పారావు, ఆర్డీవోలు కె.సాయిప్రత్యూష, సుదర్శన్‌దొర పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కుళాయిల దొంగలు కటకటాలపాలు..!

- రూ.9 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- ఏడుగురి అరెస్టు, నిందితుల్లో నలుగురు తెలంగాణ వాసులు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: ఇంటింటికీ తాగునీరందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం కుళాయిలు ఎత్తుకెళ్లిన దొంగలు దొరికిపోయారు. కేసులో కోటబొమ్మాళి పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా కేంద్రంలోని ఎస్పీ మహేశ్వరరెడ్డి గురువారం వెల్లడించారు. నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లో గుత్తేదారు మావులూరు వెంకురెడ్డి జల్‌జీవన్ మిషన్ పనులు చేయిస్తున్నారు. ఆయన వద్ద తెలంగాణ రాష్ట్రం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన కంది సంపత్, బొందాని రమేష్, చింతల మహేష్, పల్లపు యాదగిరి కూలీలుగా పని చేస్తూ చీపుర్లపాడు గ్రామంలో ఉంటున్నారు. వీరు పని ప్రదేశంలో పాడైన, పనికిరాని పైపులు, కుళాయిలను సత్రాపు సింహాచలానికి చెందిన తుక్కు దుకాణంలో విక్రయించేవారు. గుత్తేదారు పనులకు సంబంధించిన రూ.9 లక్షల విలువైన తొమ్మిది వేల ఇత్తడి కుళాయిలను కోటబొమ్మాళిలో పాకివలస వద్ద ఓ దుకాణం అద్దెకు తీసుకుని నిల్వ చేశారు. వాటిపై వీరి కన్నుపడింది. దుకాణంలోని కుళాయిలను విక్రయించి డబ్బు సంపాదించాలని పథకం వేశారు. చోరీ చేసిన సామగ్రి రవాణాకు గతంలో కూలి పనులు చేసిన కోటబొమ్మాళి మండలం వరహాలమ్మపేటకు చెందిన చెన్నంశెట్టి అప్పన్నను సాయం కోరారు. అదే గ్రామస్థుడైన సదును పల్లి రాముకు చెందిన సరకు వాహనంలో తరలించాలని నిర్ణయించారు. ఇత్తడి కుళాయిలు కలిగిన 25 మూటల్ని దాచేందుకు తుక్కు దుకాణ యజమానికి కొంత వాటా ఇవ్వాలని మాట్లాడుకున్నారు. గత నెల 30న దుకాణం షట్టర్ కింద భాగం కోసి లోపలికి ప్రవేశించి సామగ్రి ఎత్తుకెళ్లి తుక్కు వ్యాపారికి చెందిన దుకాణంలో భద్రపరిచారు. ఈ నెల 5న గుత్తేదారు కుళాయిలు భద్రపరిచిన దుకాణానికి వెళ్లి చూడగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఆయన కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



స్వాధీనం చేసుకున్న కుళాయిలు

విశాఖ వెళ్తుండగా చిక్కిన ముఠా

చోరీ సొత్తును విశాఖలో విక్రయించేందుకు వెళ్తున్నారని గురువారం టెక్కలి గ్రామీణ సీఐ కె.శ్రీనివాసరావుకు సమాచారం అందింది. ఆయన సూచన మేరకు కోటబొమ్మాళి మండలం జర్జంగి సమీపంలో జాతీయ రహదారి పైవంతెన వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నిందితులు సరకుల వాహనంలో చోరీ చేసిన కుళాయిల మూటలతో వెళ్తూ వారికి చిక్కారు. కేసు ఛేదనలో క్రియాశీలకంగా వ్యవహరించిన నేర విభాగం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, టెక్కలి గ్రామీణ సీఐ, కోటబొమ్మాళి ఎస్సై సత్యనారాయణ, పోలీసు సిబ్బంది మాధవరావు, లోకనాథం, ఉమామహేశ్వరరావులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సర్కారు వారి బకాయి..!

- ఏళ్లుగా ఆస్తి పన్ను చెల్లించని ప్రభుత్వశాఖలు
- స్థానిక సంస్థల ప్రగతిపై తీవ్ర ప్రభావం

సకాలంలో పన్నులు చెల్లించి ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన వివిధ ప్రభుత్వశాఖలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన భవనాల ఆస్తి పన్ను బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోతున్నా కనీసం పట్టించుకోవట్లేదు. అధికారులు సైతం నోటీసులివ్వడానికే పరిమితమై.. వసూళ్ల విషయంలో చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితి స్థానిక సంస్థల ప్రగతిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని జిల్లా పరిషత్తు కార్యాలయం ఏళ్లుగా ఆస్తి పన్ను డబ్బులు వసూలు కావట్లేదు. ఇప్పటి వరకు రూ.21.42 లక్షల బకాయి పేరుకుపోయింది.

జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు ఆమదాలవలస, పలాస - కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భవనాలున్నాయి. వాటికి సంబంధించి ఏళ్లుగా ఆస్తి పన్ను చెల్లించట్లేదు. సుమారు పదేళ్లలో ఏడాది 10 శాతం కూడా పన్ను వసూళ్లు జరగని పరిస్థితి నెలకొంది. అడిగితే నిధులు లేమి కారణం చెప్పి తప్పించుకుంటున్నారు. దీని కారణంగా స్థానిక సంస్థల్లో జరగాల్సిన అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది.

సామాన్యులపైనే ప్రతాపం..

అధికారుల పురపాలక సంఘాల్లో పేద, మధ్య తరగతి ప్రజల ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేస్తుంటారు. ఆర్ఆర్ చట్టం ప్రయోగంతో పాటు కుళాయి కనెక్షన్లు తొలగింపు వంటి చర్యలు వెంటనే తీసుకుంటారు. కానీ ప్రభుత్వ శాఖల విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఏటా మొక్కుబడిగా పన్ను బకాయి నోటీసులు జారీ చేసి ఊరుకుంటున్నారు. ఫలితంగా బకాయిలు ఏటికేడు పెరిగిపోతున్నాయి.

స్థానిక సంస్థ	భవనాలు	బకాయిలు (రూ.కోట్లలో..)
శ్రీకాకుళం	208	6.68
ఆమదాలవలస	74	0.72
పలాస-కాశీబుగ్గ	50	0.36
ఇచ్ఛాపురం	35	0.82

శ్రీకాకుళంలో అత్యధికం..

జిల్లా కేంద్రం శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోనే ఆస్తి పన్ను బకాయిలు అత్యధికంగా ఉన్నాయి. ఎక్కువ ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉండటంతో రూ.కోట్లలో వసూలు కావాల్సి ఉంది. ఆర్అండ్‌బీశాఖ నుంచి రూ.7.07 కోట్లు, వైద్యఆరోగ్యశాఖ 2.55 కోట్లు, వంశధార ఇంజినీరింగ్ విభాగాలు రూ.1.94 కోట్లు, పోలీసుశాఖ రూ.76.30 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంది. ఇవి కొన్ని మాత్రమే. ఈ విషయమై ఇప్పటికే అధికారులు పలుమార్లు నోటీసులిచ్చినా.. సంబంధితశాఖల అధికారులతో మాట్లాడినా ప్రయోజనం లేదు. దీనిపై శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆస్తిపన్ను బకాయిలు వసూలు చేస్తామని తెలిపారు.

జిల్లాలో వివిధ శాఖల పరిస్థితి ఇదీ..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు: 367
- పన్ను బకాయి: రూ.10.03 కోట్లు
- ఇప్పటి వరకు వసూలు: రూ.1.26 కోట్లు

ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు కమాండెంట్‌గా సత్తిబాబు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఏపీఎస్పీ బెటాలియన్‌కు-1కు అదనపు కమాండెంట్‌గా పి.సత్తిబాబును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం రాత్రి డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం ఇంటెలిజెన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు.



ధర్మలక్ష్మీపురంలో విక్రయానికి సిద్ధంగా పచ్చిధాన్యం

ఖరీఫ్ సిరులు..!

కాలం కలిసొచ్చింది.. వాతావరణం అనుకూలించింది.. జిల్లాలో అప్పుడే ఖరీఫ్ పంట చేతికొస్తోంది.. పుష్కలంగా నీటివసతి ఉండే నరసన్నపేట నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. మెట్ట ప్రాంతాల్లో తక్కువ రోజుల్లో పండే 'తరంగణి' వరి రకాన్ని సారవకోట మండలంలో వందలాది ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంట కోతదశకు రావడంతో యంత్రాల సాయంతో కొన్నిరోజులుగా కోత, నూర్పిడి చేస్తున్నారు. ఆరబెట్టేందుకు అవకాశం లేకపోవడంతో పచ్చిధాన్యాన్నే విక్రయిస్తున్నారు. స్థానిక వ్యాపారులు కొనుగోలు చేసి కాకినాడ ప్రాంతాలకు లారీల ద్వారా తరలిస్తున్నారు. 83 కిలోల బస్తా రూ.1490 చొప్పున కొనుగోలు చేస్తున్నారని, ఎకరాకు 30 నుంచి 33 బస్తాల దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, సారవకోట



సవరడ్డపనస వద్ద ఉంచిన ధాన్యం బస్తాలు

భూ సమస్యలు పరిష్కరించండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: భూములకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీసర్వే దరఖాస్తులపై తక్షణమే స్పందించాలని, తహసీల్దార్ల పరిధిలో అవకాశం ఉన్న వాటిని మండల స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు ఈ నెల 16 నాటికి నివేదిక రూపంలో అందజేయాలని చెప్పారు. ఆక్రమణలకు గురికాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత సంబంధిత శాఖలదేనని స్పష్టం చేశారు. రణస్థలం మండలంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారును ఆదేశించారు. ఉద్యాన శాఖకు సంబంధించి సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కోసం భూమిని కేటాయించేలా పర్యవేక్షించాలని పలాస ఆర్డీవోకు సూచించారు. డీఆర్వో ఎం.అప్పారావు, పలాస ఇన్‌ఛార్జి ఆర్డీవో సుదర్శన్‌దొర, కె.సాయిప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పలాస నియోజకవర్గంలో గురువారం 'మన పలాస-మన బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష పలాస ఎర్రచెరువు, పారసాంబ పనికిరాని మొక్కలు తొలగించారు. మన ఇంటి పరిసరాలు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలనూ అలాగే చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని శిరీష పేర్కొన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, కమిషనర్ ఎన్.రామారావు పాల్గొన్నారు.



– న్యూస్‌టుడే, పలాస

ఇంటింటా సౌరభం..!

సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సామాన్యులకు కరెంట్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా ఇంటి పైకప్పుపై నుంచే విద్యుత్తు ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. దీని ద్వారా కలిగే ప్రయోజనాలపై జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు.


– న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)



గోడప్రతిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఈ ఏడాది ఇప్పటి వరకు ఇచ్చిన కనెక్షన్లు..

డివిజన్	సంఖ్య
శ్రీకాకుళం	50
టెక్కలి	27
పలాస	16
పాలకొండ	2



ఉమ్మడి జిల్లాలో తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) పరిధిలోని శ్రీకాకుళం, టెక్కలి, పలాస, పాలకొండ డివిజన్లలో ఈ ఏడాది ఇప్పటి వరకు 794 ఇంటిపై సౌర ఫలకాల ఏర్పాటుకు వివరాలు నమోదు చేసుకున్నారు. వారిలో 176 మంది రుసుం చెల్లించగా.. 95 మంది అధికారులు కనెక్షన్లు ఇచ్చారు.

గరిష్ఠ రాయితీ రూ.78 వేలు..

వినియోగదారులు www.pmsuryaghar.gov.in/apepdcl వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అందులోనే సౌర ఫలకాలు సరఫరా చేసేవారిని ఎంపిక చేసుకున్నాక యూనిట్ ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత వినియోగదారుడి బ్యాంకు ఖాతాకే రాయితీ జమ అవుతుంది. పథకం ద్వారా కిలోవాట్ నుంచి మూడు కిలోవాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తికి మాత్రమే రాయితీ ఇస్తారు. అంతకు మించి సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటు చేసుకున్నా రూ.78 వేలే సబ్సిడీ వస్తుంది. ఒక ఇంటికి ప్రస్తుతం ఎంత విద్యుత్తు వినియోగిస్తున్నారో ఆ మేరకు యూనిట్ మంజూరు చేస్తారు. కిలోవాట్ సౌర ఫలకాల ఏర్పాటుకు ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం అవసరం.

కిలోవాట్	ఖర్చు (రూ.వేలల్లో..)	రాయితీ
ఒకటి	83	33
రెండు	114	60
మూడు	210	78

'పీఎం సూర్యఘర్'పై విస్తృత ప్రచారం

అవకాశం వినియోగించుకోండి..

జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్తు బిల్లు ఆదా, కలిగే ఇతర ప్రయోజనాలను వివరిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు మీ పరిధిలోని అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజినీర్(ఏఈ)ను సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలియజేస్తారు. వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం.

– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ, ఈపీడీసీఎల్, శ్రీకాకుళం సర్కిల్

కబడ్డీ విజేత శ్రీకాకుళం



వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానంరా మక్కపేటపురంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. 110 జట్లు పాల్గొనగా శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. తరువాత స్థానాలను అమలపాడు, శ్రీకాకుళం కేఆర్ స్టేడియం, జీఎంఆర్ఐటీ జట్టు దక్కించుకున్నాయి. ఐదో స్థానాన్ని శ్రీకాకుళం గల్లీ బాయ్స్ జట్టు సొంతం చేసుకుంది. ప్రథమ విజేత బృందానికి రూ.30 వేల నగదు, జ్ఞాపికలను ప్రవాసాంధ్రుడు లింగాల సోమేశ్వరరావు సమకూర్చారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.25 వేలు, 20 వేలు అందించారు. సర్పంచి చింత నారాయణ, మాజీ సర్పంచి చింత హేమారావు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

రాయితీపై వంట నూనెల విక్రయం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: బహిరంగ విపణిలో వంట నూనెల ధరలు పెరగడంతో వినియోగదారులకు కొంత ఆర్థిక భారం తగ్గించాలని రాయితీపై విక్రయించడానికి శ్రీకాకుళం నగరంలో మూడు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని డీఎస్‌వో సూర్యప్రకాష్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని రైతుబజారు, కలింగ రోడ్డులోని డీసీఎస్ కార్యాలయం సమీపంలో, పెద్ద మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పామాయిల్ రూ.5 నుంచి రూ.10 వరకు రాయితీపై విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎస్ డీటీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



రైతు బజారులో వంటనూనెల విక్రయాలను పరిశీలిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాష్

ఎస్సీ, ఎస్టీ పథకాల పునరుద్ధరణకు కృషి



ఎమ్మెల్యేలు మురళీమోహన్, జయకృష్ణలను సత్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఎస్సీలంతా ఐక్యతతో ముందుకు సాగాలని రాజాం, పాలకొండ ఎమ్మెల్యేలు కోండ్రు మురళీమోహన్, నిమ్మక జయకృష్ణ కోరారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో గురువారం జిల్లా దళిత, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ పథకాలు, ఎస్సీ కార్పొరేషన్ పునరుద్ధరణకు కృషి చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి, సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. నాయకులు ఎన్.భరత్‌భూషణ్‌రాజు, పి.దుర్గారావు, బి.మన్మధరావు, కె.డేనియల్, గంజి ఎజ్రా పాల్గొన్నారు.

దుర్గామాతగా కోటదుర్గమ్మ



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు గురువారం పాలకొండ కోటదుర్గమ్మ దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే రద్దీగా మారింది. ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. వడమ గ్రామం నుంచి మహిళలు ఘటాలతో ఆలయానికి ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ

స్వచ్ఛతే అందరి లక్ష్యం కావాలి : ఎమ్మెల్యే శిరీష

పలాస, న్యూస్‌టుడే: స్వచ్ఛతే అందరి లక్ష్యం కావాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆకాంక్షించారు. నియోజకవర్గవ్యాప్తంగా గురువారం 'మన పలాస-మన బాధ్యత' పేరిట కార్యక్రమం ప్రారంభించారు. పలాసలో ఎర్రచెరువు, పారిశ్రామిక వాడ వద్ద సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి పొదల తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు వస్తేనే పనులు చేస్తామంటే కుదరదని.. ప్రజా భాగస్వామ్యంతో పని చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టామని స్పష్టం చేశారు. జేసీ మాతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పొక్లెయిన్‌తో సుమారు 500 కిలోమీటర్ల మేర పొదలు తొలగించాలని నిర్ణయించామని చెప్పారు. రానున్న రోజుల్లో జిల్లాతో పాటు రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. జేసీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు.. ఈ సమయంలో ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో మార్పునకు శ్రీకారం చుడుతుందన్నారు. తహసీల్దారు కల్యాణ చక్రవర్తి, కమిషనర్ ఎన్.రామారావు, పురపాలక సంఘం అధ్యక్షుడు బల్ల గిరిబాబు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్లు జి.సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పి.విఠల్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, జాతీయ సేవా పథకం, మెప్మా, వెలుగు, పురపాలక సంఘ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపుతారా..?

పాతపట్నం, న్యూస్‌టుడే

జిల్లాకు సరిహద్దు ప్రాంతం పాతపట్నం. సమీపంలోని ఒడిశాకు వెళ్లాలంటే 326ఎ జాతీయ రహదారిపై ప్రయాణించాలి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రహదారి పాతపట్నం పంచాయతీతో అనుసంధానమైంది. గ్రామంలో ఉత్సవాలు, భారీ సమావేశాల సమయంలో ట్రాఫిక్ నిలిచిపోతే సరిహద్దు ప్రాంతాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో పాతపట్నం వెలుపల నుంచి ప్రత్యామ్నాయంగా రింగ్ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



నీలమణిదుర్గ ఉత్సవాల సమయంలో వాహనాలతో కిక్కిరిసిన ప్రధాన రహదారి

రాష్ట్ర సరిహద్దులో రాకపోకలకు తప్పని ఇక్కట్లు

పాతపట్నం వద్ద రింగ్ రోడ్డు నిర్మిస్తే మేలని సూచన

పాతపట్నం నియోజకవర్గ కేంద్రానికి తూర్పు దిశగా జోగికొండ, పడమర వైపు మహేంద్రతనయ నది ఉన్నాయి. ఒడిశా వైపు వెళ్లే 326ఎ జాతీయ రహదారి కొన్ని సందర్భాల్లో అత్యంత రద్దీగా మారుతోంది. వాహనదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇటీవల వాహనాల సంఖ్య పెరగడంతో తరచూ సమస్య తలెత్తుతోంది. పాతపట్నంలో ఉత్సవాలు, బహిరంగ సభలు, ఇతర సందర్భాల్లో ప్రధాన రహదారి వాహనాలతో కిక్కిరిసిపోతోంది.

గతంలో నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపారు. బూరగాం వద్ద మహేంద్రతనయ నదిలో మట్టితో తాత్కాలిక రహదారిని నిర్మించారు. వాహనదారులు బూరగాం నుంచి కె.గోపాపురం, హెచ్.గోపాలపురం గ్రామాల మీదుగా ఒడిశాకు చేరుకున్నారు. బూరగాం వద్ద కాజ్‌వే సహా శాశ్వత ప్రాతిపదికన రహదారి నిర్మిస్తే భవిష్యత్తులో రాకపోకలకు ఇబ్బంది ఉండదని స్థానికులు చెబుతున్నారు.

వాహనదారులకు ప్రయోజనం



పాతపట్నం మేజరు పంచాయతీ రహదారిని తప్పించి గ్రామ శివారు నుంచి రోడ్డు నిర్మిస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. జాతీయ రహదారిగా అభివృద్ధి చెందిన తరువాత వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గం ఉంటే రాకపోకలకు ఇబ్బంది ఉండదు. – వట్టి కన్నారావు, స్థానికుడు

సమగ్ర పరిశీలన చేస్తాం..

పాతపట్నం మేజరు పంచాయతీ పరిధిలో ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై సమగ్రంగా పరిశీలన చేస్తాం. ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. – మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

వైద్యం వికటించి చిన్నారి మృత్యువాత..!



జశ్విక (పాత చిత్రం)



రోదిస్తున్న తల్లి హిమబిందు

గుజరాతీపేట(శ్రీకాకుళం), శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: వైద్యం వికటించి ముక్కుపచ్చలారని చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని చేపల వీధికు చెందిన టి.శ్రావణ్‌కుమార్, హిమబిందు దంపతుల కుమార్తె జశ్విక (18 నెలలు) పుట్టినప్పటి నుంచి వాంతులయ్యేవి. చికిత్స నిమిత్తం ఆమెను బొందిలీపురం సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గత నెల 30న చేర్చారు. కడుపులో పేగు మడతపడిందని ఈ నెల ఒకటో తేదీన శస్త్రచికిత్స చేశారు. బుధవారం రాత్రి పాప బాగా ఏడవడంతో తల్లిదండ్రులు ఆసుపత్రి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. అప్పుడు విధుల్లో ఉన్న వైద్యురాలి ఆధ్వర్యంలో నర్సులు మత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. కొన్ని క్షణాల్లోనే చిన్నారి కాళ్లు, చేతులు కొట్టుకుంటుండటంతో వారు ప్రశ్నించారు. మత్తు మందు ప్రభావంతో ఇలా జరిగి ఉంటుందని..సాధారణ స్థితికి వచ్చేస్తుందని చెప్పి ఐసీయూకి తీసుకెళ్లారు. గురువారం ఉదయం కుమార్తెను తల్లిదండ్రులు చూసేసరికి మృతి చెందిందని సిబ్బంది చెప్పడంతో హృదయవిదారకంగా రోదించారు. ఈ విషయం కుటుంబ సభ్యులు, వారు నివాసం ఉండే ప్రాంత వాసులకు తెలియడంతో ఆసుపత్రి వద్దకు పెద్దఎత్తున చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

నరసన్నపేట, న్యూస్‌టుడే: పోలాకి మండలం వనవిష్ణుపురం గ్రామంలో జరిగిన హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ జె.శ్రీనివాసరావు ప్రకటించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జడూరు కూడలి వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అరెస్టు చేసిన వారిలో ప్రధాన నిందితుడు పాలిన కృష్ణమూర్తితో పాటు తలగాన పిల్లయ్య, తలగాన దుర్గారావులను కోర్టులో హాజరు పరిచామన్నారు. మరో 9మంది కోసం గాలిస్తున్నామని వెల్లడించారు. వనవిష్ణుపురంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, గ్రామంలో పోలీసు పికెటింగ్ కొనసాగుతోందన్నారు. కేసును పోలాకి ఎస్సై రంజిత్ నమోదు చేయగా, సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

25 కిలోల గంజాయి పట్టివేత

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఒడిశా మోహన గ్రామంలో కొనుగోలు చేసిన 25 కిలోల గంజాయిని ఇచ్ఛాపురం మీదుగా ముంబయి తరలించేందుకు వస్తున్న ఇద్దరిని స్థానిక రైల్వే ఎల్‌సీ గేటు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. పోలీస్ సర్కిల్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. మహారాష్ట్ర పల్గార్ జిల్లా విరర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్న సోమెన్ రఫీక్ షేక్ అలియాస్ షరూక్ అదే రాష్ట్రం రాయఘూర్ జిల్లా కోన్ గ్రామానికి చెందిన సాగర్ మహేష్ కడ్నే కలిసి ఒడిశా మోహనలో 25 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. బస్సుమార్గంలో ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఇక్కడ నుంచి రైలులో ముంబయి వెళ్లేందుకు ప్రణాళిక వేశారు. వారి అనుమానాస్పద కదలికలను గమనించిన గ్రామీణ ఎస్సై ఇ.శ్రీనివాస్, సిబ్బంది, మధ్యవర్తులతో వారిని తనిఖీ చేసి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. గంజాయితో పాటు ఒక చరవాణిని స్వాధీన పరచుకుని, ఇద్దరినీ అరెస్టుచేసి న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో రూరల్ ఎస్సై పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

వైకాపాకు ప్రజాదరణ తగ్గలేదు

నరసన్నపేట, న్యూస్‌టుడే: వైకాపాకు ప్రజాదరణ తగ్గలేదని, ఎన్నికల్లో ఓడిపోయినా భవిష్యత్తులో జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యమని వైకాపా నాయకులు అన్నారు. నరసన్నపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం వైకాపా జిల్లా అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణదాస్, పార్లమెంటరీ పార్టీ కన్వీనరుగా తమ్మినేని సీతారాం, డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా సీదిరి అప్పలరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రజల్ని నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను గాలికి వదిలేసిందన్నారు. తమ్మినేని సీతారాం మాట్లాడుతూ తనను ఒడిశా పంపిస్తామని చంద్రబాబు అనడం హాస్యాస్పదమని, వంద అవతారాలు ఎత్తినా అది సాధ్యం కాదన్నారు. సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ జిల్లాకు విమానాశ్రయం తీసుకొస్తానని కేంద్రమంత్రి ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, అప్పలరాజు పక్కన పేరాడ తిలక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	140	235	255

తైక్వాండో పోటీల్లో సత్తా

శ్రీకాకుళం అర్బన్,న్యూస్‌టుడే: తిరుపతిలో ఈ నెల 4 నుంచి 8 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-14, 17, 19 విభాగాల్లో 4 స్వర్ణ, 3 రజత, 5 కాంస్య పతకాలు సాధించారు. విజేతలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, డీఎస్ఏ తైక్వాండో శిక్షకుడు లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

డీఎఫ్‌వో బాధ్యతల స్వీకరణ



వెంకటేష్

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా అటవీశాఖాధికారి(డీఎఫ్‌వో)గా ఎస్.వెంకటేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం డీఎఫ్‌వోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలోనూ శ్రీకాకుళం ఇన్‌ఛార్జి డీఎఫ్‌వోగా వ్యవహరించారు. రెండు రోజుల కిందట ప్రభుత్వం జిల్లా అటవీశాఖాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో శ్రీకాకుళం నగరంలోని కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రేంజ్ అధికారులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309639875
పలాస గ్రామీణం : 7386408926
కంచిలి గ్రామీణం : 9704568739

సమస్య : ఇచ్ఛాపురం పట్టణం ఖజానా వీధి, పెద్దర లచ్చి కూడలిలో ఉన్న మంచినీటి బోరు పనిచేయక ఇబ్బంది పడుతున్నాం. - పి.సదానంద, ఇచ్ఛాపురం

సమాధానం : పరిశీలించి మరమ్మతు చేయిస్తాం. - పి.కామేశ్వరరావు, ఏఈ, ఇచ్ఛాపురం - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం లొత్తూరు ప్రధాన వీధిలో కాలువలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం - స్థానికులు

● త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం - రూపేంద్ర, పంచాయతీ కార్యదర్శి, లొత్తూరు - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

ఆర్థిక సాయం అందజేత



కంచిలి మండలం మండపల్లిలోని సీతయ్య పొందే షన్ అనాద, వృద్ధాశ్రమానికి ఆర్థిక సాయం చేసేందుకు సోంపేట మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన ఉలాల హరికృష్ణ, జ్యోతి దంపతులు ముందుకొచ్చారు. వారి వంతు సాయంగా రూ.50 వేలు గురువారం నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మాకన్నపల్లి సర్పంచి, సోంపేట మండల తెదేపా అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, ఎం.ఎస్.ఆర్. సేవా సంఘం సభ్యులు, ఎం.శంకరరావు, బి.గణపతి తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కంచిలి

పరిశుభ్రతకు నడుంబిగిద్దాం



పలాస: పారసాంబ రహదారిని చీపురుతో శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



వజ్రపుకొత్తూరు: దోకులపాడు తీర రహదారిని బాగు చేస్తున్న యువత

పలాస నియోజకవర్గంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పరిశుభ్రత వంటి పనులు స్వచ్ఛందంగా చేయాలనే తలంపుతో 'మన పలాస-మన బాధ్యత' పేరుతో గురువారం ప్రత్యేక కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఆర్‌అండ్‌బీ రహదారులకు ఇరువైపులా ఉండే పనికిరాని మొక్కలు తొలగించేలా ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే పిలుపుతో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల వ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.
- న్యూస్‌టుడే, పలాస, వజ్రపుకొత్తూరు గ్రామీణం, పలాస గ్రామీణం

వాణిజ్య సముదాయం భయానకం

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలావస్థకు భవనాలు

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం: పురపాలక సంఘాలను గత పాలకులు పట్టించుకోకపోవడంతో వాటి నుంచే వచ్చే ఆదాయ వనరులు తగ్గుతున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా, ఉన్న వనరులను వినియోగించుకునేలా ఐదేళ్లలో ఎలాంటి సహకారం లేకపోవడంతో ఇచ్ఛా'పుర'ం ఆదాయం పెరగక, చిన్న చిన్న సమస్యలనూ పరిష్కరించుకోలేకపోతోంది. పెచ్చులూడిన శ్లాబులు, ఇనుప కడ్డీలు బయటకు వచ్చేలా స్తంభాలు దర్శనమిస్తుండటంతో ప్రజలు ఆయా దుకాణాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. వైకాపా పాలనలో భవనాలకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని వినియోగదారులకు వాపోతున్నారు.



బస్టాండు వద్ద ఉన్న శిథిల వాణిజ్యసముదాయం

ఏటా రూ.లక్షల్లో ఆదాయం..

గతంలో పట్టణ మధ్యగా ఉండే పాత జాతీయ రహదారి విస్తరణ అనంతరం దుకాణాలు కోల్పోయిన వారి కోసం 1997లో తెదేపా ప్రభుత్వం మూడుచోట్ల వాణిజ్య సముదాయాలను నిర్మించి, పురపాలక సంఘానికి అప్పగించింది. ఇవే పురాదాయానికి పెద్ద వనరుగా ఉండి వందలాది కుటుంబాలకు జీవనోపాధిని కల్పించేవి. బస్టాండులో 56, పురపాలక సంఘ కార్యాలయం చుట్టూ 46, ఆసుపత్రి రోడ్డులో 16 దుకాణాలను నిర్మించారు. వీటి ద్వారా ఏటా రూ.16 లక్షలు, పుర కార్యాలయం వద్ద రూ.7 లక్షలు, యూ కాంప్లెక్స్ నుంచి సుమారు రూ.5 లక్షల ఆదాయం సమకూరుతోంది.



పెచ్చులూడిన శ్లాబ్

వ్యాపారులే నిర్మించుకున్నారు..

వైకాపా బస్సు యాత్ర సందర్భంగా బస్టాండులో నడిరోడ్డును మూసేసి, వేదిక నిర్మించారు. ఆ కార్యక్రమం కోసం వాణిజ్యసముదాయాలపై పుర సిబ్బంది వైకాపా జెండాలను కట్టారు. అప్పటికే శిథిలమైన పైభాగం, జెండాలు గాలికి ఊగినప్పుడు మరింతి పట్టుతప్పింది. శిథిలమైన రక్షణ గోడలను వ్యాపారులే నిర్మించుకున్నారు. కూటమి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుని వాణిజ్యసముదాయలను పునర్నిర్మించి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ..

దుకాణాల పరిస్థితి చూస్తే ఆందోళన కలుగుతోంది. ఏ క్షణాన ఏది మీద పడుతుందో తెలియదు. వ్యాపారులు బిక్కుబిక్కుమంటు ఉంటున్నారు. వినియోగదారులు వెళ్లి రావడానికి భయపడుతున్నారు. - బి.జయరాం, వినియోగదారుడు, ఇచ్ఛాపురం

ప్రతిపాదనలు ఉన్నాయి.

బస్టాండు వద్ద వాణిజ్య సముదాయానికి మరమ్మతుల కోసం రూ.10 లక్షలతో ప్రతిపాదించాం. మరోసారి పరిశీలించి, అవసరం మేరకు వాటని సవరిస్తాం. వాణిజ్య సముదాయాన్ని కొత్తగా నిర్మించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో కౌన్సిల్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.
- నల్లి రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం పురపాలక సంఘం

నేటి ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ పోలీస్ ఠాణాలో ప్రతి శుక్రవారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆధర్వంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (మీకోసం) కార్యక్రమం శుక్రవారం రద్దు చేస్తున్నట్లు సీఐ డి.మోహనరావు పేర్కొన్నారు. దుర్గాష్టమి సెలవు దినం కావడంతో కార్యక్రమం నిర్వహించట్లేదని, ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

15 దుకాణాలకు 152 దరఖాస్తులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: అబ్కారీ ఎక్సైజ్ శాఖ పలాస ఠాణా పరిధిలో 15 మద్యం దుకాణాలకుగాను గురువారం వరకు 152 ధరఖాస్తులు అందాయని సీఐ కె.మల్లికార్జునరావు పేర్కొన్నారు. పలాస-కాశీబుగ్గ పట్టణాల్లోని 7, పలాస మండలానికి సంబంధించి మూడు దుకాణాలకు తక్కువ ధరఖాస్తులు వచ్చాయన్నారు. ఆశక్తి ఉన్నవారు శుక్రవారం సాయంత్రం 7 గంటలు లోగా ధరఖాస్తు చేసుకోవాలని సీఐ పేర్కొన్నారు.

ఎర్రచెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోండి

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఎర్రచెరువు ఆక్రమణలో నిండిపోతోందని వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మాద్ ఖాన్‌కు విన్నవించారు. మన పలాస మన బాధ్యత కార్యక్రమానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ ఆక్రమణలపై తహసీల్దార్‌కు బాధ్యత అప్పగిస్తామని, ఎర్రచెరువులో బ్యూటిఫికేషన్ చేపట్టేందుకు అనువుగా ఉందని తనకు నివేదిక పంపించాలని కోరారు.

అవగాహన సభ

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అధిక సొమ్ములు, ఉచితంగా ఇచ్చే వాటి కోసం వెళ్తే, మోసపోవడమేనని ఇచ్ఛాపురం గ్రామీణ ఎస్సై ఇ.శ్రీనివాస్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అరకబద్రలో గురువారం అవగాహన సభ నిర్వహించి ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, సైబర్ నేరాలు, వాటి రకాలపై అవగాహన కల్గించారు.

అధ్వాన దారి..

కంచిలి మండలంలోని బెసి నుంచి శాసనాం వైపు వెళ్లే బాతుపురం ఆర్‌అండ్‌బీ రహదారి శారదాపురం కూడలి వద్ద ప్రమాదకరంగా మారడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందుల పడుతున్నారు. ఆ ప్రాంతంలో ఆయిల్ పైపులైను కోసం తవ్వి అనంతరం రోడ్డును సక్రమంగా పూడ్చకుండా విడిచిపెట్టడంతో రాత్రి వేళ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పరిష్కరించలేదని పేర్కొంటున్నారు. ఈ విషయం ఆ శాఖ ఏఈ విక్రమ్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



నియంత్రికతో జరభద్రం



వజ్రపుకొత్తూరు మండలం చిన వంకలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ పరిసరాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. పనికిరాని మొక్కలు, ముళ్ల పొదలు దట్టంగా పెరగడంతో అటు వైపు వెళ్లాలంటే స్థానికులు భయపడుతున్నారు. అత్యవసర సమయంలో విద్యుత్తు నిలుపుదల చేయాలన్న ఇబ్బందులు తప్పడం లేదని, నియంత్రిక పరిసరాలు శుభ్రపరిచి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వెంటనే పనికిరాని మొక్కలు, పొదలు తొలగించే చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఏఈ వెంకటరమణ తెలిపారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

గుంతల రోడ్డులో రాకపోకలెలా?

పలాస మండలం గంగువాడ ఎస్సీ వీధి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంత కారణంగా ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాదారులు రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి ఫల్గుణరావు దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం



పడిపోతే.. ప్రమాదమే



ఇచ్ఛాపురం ఉప్పాడవీధి కూడలిలో విద్యుత్తు స్తంభం రోడ్డు వైపు వాలి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. మూడు రోడ్ల కూడలి కావడం, బెల్లుపడకు ప్రధాన రహదారిగా వినియోగిస్తుండటంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటోంది. పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఉపకేంద్ర ఏఈ కేవీ గోవిందరావు తెలిపారు.
- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

నేడు తపాలబీమా, పొదుపు ఖాతాల మేళా

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం ఉపతపాలా కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్‌ఐ), గ్రామీణ తపాలా జీవితబీమా (ఆర్‌పీఎల్‌ఐ)లతో పాటు పొదుపు ఖాతా ప్రారంభం చేసుకోవచ్చునని తపాలా అధికారి జ్ఞానవతి తెలిపారు. ఇవి ప్రతి ఒక్కరికీ ఉపయోపడతాయని, అవగాహన చేసుకోవాలన్నారు. గురువారం నిర్వహించిన ఆధార్ ప్రత్యేక సేవలను 25 మంది వినియోగించుకున్నారని ఆమె పేర్కొన్నారు.

కరుణించమ్మా.. దుర్గమ్మా



కంచిలి : దుర్గామాతగా కంచమ్మతల్లి



పలాస సత్యసాయి సేవాసమితిలో లక్ష పుష్పార్చనలో మహిళలు



వజ్రపుకొత్తూరు గ్రామీణం: పీఎంపురంలో కుంకుమ పూజలు

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం పలుచోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో మహిళలు సాముహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.
- న్యూస్‌టుడే, బృందం



ఇచ్ఛాపురం: గిలాయివారింట స్వేచ్ఛావతి అమ్మవారికి పుట్టింట ఉపారాలు



కీర్తిపురం పద్మావతి అమ్మవారి చెంత ఎమ్మెల్యే డా.అశోక్ తదితరులు

అవీ.. ఇవీ.. అన్నీ



క్విజ్ విజేత కవిటి

సోంపేట, న్యూస్‌టుడే : మండలంలోని లక్కవరం గ్రామంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా గురువారం ఉత్తరాంధ్ర క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో 50 జట్లు పాల్గొనగా పరీక్ష ద్వారా తుది పోరుకు 8 జట్లు ఎంపికై అందులో విజేతగా కవిటి చింతామణి, ద్వితీయ స్థానంలో లండారిపుట్టుగ, తృతీయ స్థానంలో లక్ష్మీనారాయణ జట్టు నిలిచాయి. వీరికి నిర్వాహకులు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. సనపల శ్రీరామ్మూర్తి, వజ్జ కృష్ణారావు, పండి నారాయణరావు, హేమసుందర్, లక్కవరం యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లి విద్యార్థుల ప్రతిభ

మందస, న్యూస్‌టుడే : పలాస మండలం రంగోయిలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో మందస మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రెండో స్థానంలో నిలిచి పాఠశాలకు గుర్తింపు తెచ్చారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులను ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

సాదాసీదాగా మండల పరిషత్తు సమావేశం

సోంపేట, న్యూస్‌టుడే : కలిసికట్టుగా పని చేసి మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. సోంపేట మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎంపీపీ నిమ్మన దాసు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయం వరి పంటలో ఆశిస్తున్న పురుగు, దోమ పోటుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయాధికారి బి.నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతీ మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఇక్కడ బదిలీపై వెళ్లిన ఎంపీడీవో బెందాళం వెంకటరమణను సర్పంచులు, ఎంపీటీసీలు ఘనంగా సత్కరించారు.

శ్రీనివాసుడికి నృత్యనీరాజనం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో శ్రీనివాసునికి నృత్యనీరాజనం సమర్పించేందుకు ఇచ్ఛాపురం నృత్య కళాకారులు పయనమయ్యారు. వేంకటేశ్వర నృత్య అకాడమీ సంస్థ నాట్య గురువు శృతి పట్నాయక్ ఆధ్వర్యంలో, కూచిపూడి నాట్యాచార్యులు ఏలేశ్వరపు శ్రీనివాసులు పర్యవేక్షణలో గురువారం ప్రదర్శన ఇచ్చారు.

ఘనంగా పుణ్యతిథి ఉత్సవాలు

పలాస, న్యూస్‌టుడే: పలాస రైల్వేకాలనీ సీతారామాలయ కాంప్లెక్స్‌లో శిర్డీసాయి ధ్యాన మందిరంలో బాబా పుణ్యతిథి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజున గురువారం ఉదయం నిత్యపూజలు జరిపారు. మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ జరిపారు. రాత్రి 7 గంటల నుంచి బాబా సమాది వద్ద సాయి సచ్ఛరిత్ర సామూహిక పారాయణం చేశారు. ఆలయ కార్యదర్శి జి.జె.ఎస్.రెడ్డి, కమిటీ సభ్యులు, సాయి సేవకులు పాల్గొన్నారు.



భానుడి స్పర్శ



ఇచ్ఛాపురం జగన్నాథస్వామి ఆలయంలో కొలువుతీన మహాలక్ష్మీదేవికి గురువారం సూర్యోదయవేళ ఆదిత్యకిరణాలు స్పర్శించాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశేష అభిషేకాల కోసం ఏర్పాట్లు చేశారు. అనుకోని విధంగా రవికిరణాలు నేరుగా అమ్మను తాకడంతో భక్తులు తన్మయత్వం చెందారు.
- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

రతన్ టాటాకు నివాళి



ఇచ్ఛాపురం బస్టాండులో రతన్‌టాటాకు నివాళులు అర్పిస్తున్న తెదేపా నాయకులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: విలువలతో కూడిన వ్యాపారం, నిరుపేదల కోసం నిరంతరం తపన, దేశ అభ్యున్నతికి, యువతకు ఉపాధి లభించాలనే ఆసక్తితో ఎన్నో పరిశ్రమలను నెలకొల్పిన దిగ్గజం రతన్‌టాటా అని వక్తలు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం బస్టాండు వద్ద గురువారం ఏర్పాటుచేసిన సంస్మరణ వేదిక వద్ద టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ నాయకులు మహమ్మద్ జిలానీ, కొర్రాయి ధర్మరాజు, జన్నెల సంతోష్, పూనా సంతోష్, వ్యాపారులు పాల్గొన్నారు. ● రతన్ టాటాతో వేదికను పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని ఉద్దానం యువజన జేఏసీ అధ్యక్షుడు డా.పూడి కిరణకుమార్ అన్నారు.



ఏయూ పూర్వవిద్యార్థుల సంఘ సమావేశంలో ముఖ్యఅతిథిగా రతన్ టాటా.. ఇదే వేదికపై పూడి కిరణ్‌కుమార్ (వృత్తంలో)

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

'పల్లె పండగ'తో వికాసం

నరసన్నపేట, న్యూస్‌టుడే: పల్లె పండగ పథకంతో అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పలు శాఖలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులతో గురువారం రాత్రి సమావేశమయ్యారు. నియోజకవర్గంలో రూ.24 కోట్లతో అత్యవసర పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు.

అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ గురుకులం పరిధి మెళియాపుట్టి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఒప్పంద ప్రాతిపదికగా పని చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీజీటీ గణితం, పీజీటీ భౌతికశాస్త్రం విభాగాల్లో బోధన పట్ల ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సీతంపేట పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 19లోగా పనిదినాల్లో అందించాలని కోరారు.

తీర్మానాల పేరిట అభివృద్ధిని అడ్డుకోవద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఎల్ఎన్‌పేట, పాతపట్నం, న్యూస్‌టుడే: గ్రామసభలు ద్వారా మండలానికి సుమారు రూ. 11 కోట్లు నిధులు ఆమోదం జరిగితే మండల పరిషత్ సభ్యులు తీర్మానాలు చేయకుండా అడ్డుకోవటం సరి కాదని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గురువారం ఎల్ఎన్‌పేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి పని చేస్తుందన్నారు. గత అయిదేళ్లుగా ఒక్క రూపాయి నిధులు కూడా గ్రామాలకు రాలేదని ప్రస్తుతం నిధులు వస్తే తీర్మానం పేరిట అడ్డుకుంటున్నారని, అడ్డంకులు సృష్టించడం మాని సహకరించాలన్నారు. అధికారులు ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు.

★ పాతపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయ సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. విధుల్లో ఉండాల్సిన పొరుగు సేవల సిబ్బంది లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో కాపాలాకు మహిళను 2017లో నియమించారు. ఆమె ఎప్పుడూ విధులకు హాజరు కావడం లేదన్నారు. ఏఎంసీ కార్యదర్శి రాజామోహనరావుతో ఫోన్‌లో మాట్లాడారు. సిబ్బంది పనితీరుపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఎన్నాళ్లీ వేదన..!

- చినుకు పడితే ఆందోళన
- పలు ప్రాంతాల్లో వేధిస్తున్న మురుగు సమస్య
- మంత్రిపైనే ఆశలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే

డివిజన్‌కేంద్రం టెక్కలిలోని పలు ప్రాంతాలు చిన్నపాటి వర్షానికే జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్నాయి. రానున్న రోజుల్లో వర్ష సూచన, తుపాను పొంచి ఉందని వాతావరణశాఖ తెలియజేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మురుగు నీరు రోడ్డుపూకి చేరడంతో పాటు చెరువుల్లో వరదనీరు వీధుల్లోకి వచ్చేస్తోందని, రాత్రివేళ వానలు పడితే నిద్ర ఉండదని, విషకీటకాలు భయం ఉంటుందని వాపోతున్నారు. గత అయిదేళ్లలో కనీస నిర్వహణకు నోచుకోని కాలువల వ్యవస్థను సరిదిద్దాలని కోరుతున్నారు.

అసలెందుకీ పరిస్థితి..

టెక్కలిలో 130 వరకు వీధులు, 40 వేల జనాభా ఉన్నారు. శివారులో ఉన్న చెరువులు పట్టణం విస్తరించడంతో మధ్యలోకి వచ్చేశాయి. చుట్టుపక్కల కాలనీలు వెలిశాయి. సరైన కాలువ వ్యవస్థ లేకపోవడం, చాలా ప్రాంతాల్లో కాలువలకు అవుట్‌లెట్‌లు లేకపోవడం సమస్యగా మారింది. తెదేపా హయాంలో టెక్కలి ప్రధాన మార్గాల్ని విస్తరించి పక్కా కాలువ నిర్మించారు. వాటిపై వేసిన సిమెంటు పలకలపైనే దుకాణదారులు నిర్మాణాలు చేయడంతో నిర్వహణ కష్టంగా మారింది. వాటి కింద పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకోవడంతో మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది.



శ్రీనివాసనగర్‌లో.. (పాతచిత్రం)



టెక్కలి- తొలుసూరుపల్లి మార్గంలో నిలిచిపోయిన వర్షం నీటిలోనే రాకపోకలు (పాతచిత్రం)

అచ్చెన్న పై నమ్మకం..

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయ్యప్పనగర్, భవానీనగర్, మండాపొలంకాలనీ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. కాలువల వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతోందని గుర్తించి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో టెక్కలిని అభివృద్ధికి చిరునామాగా చేసి చూపిస్తానని ప్రకటించడంతో ఆయన పరిష్కరిస్తారన్న నమ్మకంతో ఉన్నారు.

సమస్యలు ఈ కాలనీల్లోనే

★ టెక్కలిలోని నేటికీ ఇళ్లముందు వర్షం నీరు నిలిచిపోయి కనిపిస్తోంది. వర్షాలు వదిలి రెండువారాలు దాటుతున్నా ఇక్కడ మురుగు నీరు మాత్రం కదలడంలేదు. కాలువల వ్యవస్థ పూర్తిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

★ టెక్కలిలోని శంభానవీధిలో షిర్డీసాయి మందిరం వద్ద ★ పాతజాతీయ రహదారి, కంద్రవీధి, సొగ్గాడి పేట ★ అఫీషియల్ కాలనీలోని శ్రీనివాసనగర్ ★ మండాపొలం కాలనీతో పాటు మరికొన్ని ప్రాంతాలు ఉన్నాయి.

పరిష్కారం దిశగా చర్యలు.. మండాపొలంకాలనీ, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో ముంపు సమస్య వేధిస్తోంది. 10 వీధుల్లో కాలువల నిర్మాణానికి ఉపాధి నిధులతో గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు అంచనాలు రూపొందించి కలెక్టర్‌కు నివేదించాం. - **జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి, టెక్కలి**

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ప్రశ్న: నందిగాం మండలం నవగాం ఎస్సీ వీధిలోని 5 వీధి దీపాలకు 3 వెలగడం లేదు.
– **భూషణ్, నవగాం**

సమాధానం: తగు చర్యలు తీసుకుంటాం
జ్యోత్స్న, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, నవగాం -న్యూస్‌టుడే, నందిగాం

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : ఈ నెల 5, 6, 7 తేదీల్లో విశాఖ జిల్లాలో జరిగిన జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో సబ్‌జూనియర్ విభాగంలో టెక్కలికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు కిరణ్, భవాని, జూనియర్స్ విభాగంలో యోగి, సాయిశంకర్‌రెడ్డి ద్వితీయస్థానంలో నిలిచినట్లు శిక్షకుడు తెలిపారు. గురువారం వారిని పలువురు అభినందించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



పోలాకి మండల పరిధిలోని పల్లిపేటకు వెళ్లే మార్గంలో చింతువానిపేట సమీపంలో విద్యుత్ స్తంభాలు నుంచి తీగల వరకు పనికిరాని మొక్కలు అల్లుకున్నాయి. పశువులు ఇక్కడకు వచ్చి వాటిని తింటున్నాయి. తీగ మొక్కల వల్ల ప్రమాదం సంభవిస్తుందని మొక్కలు తొలగించాని స్థానికులు కోరుతున్నారు. ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, పోలాకి

నిర్మించి 7 నెలలు

సారవకోట మండలంలోని వాండ్రాయి గ్రామంలో డా.వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పూర్తయి ఏడు నెలలైనా.. వినియోగించడం లేదు. గుత్తేదారుకు బిల్లు చెల్లింపు జరగకపోవడమే ఈ దుస్థితికి కారణం. దీంతో సిబ్బంది సచివాలయంలో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. పాలకులు స్పందించి బిల్లు చెల్లించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని కార్యదర్శి అరుణకుమారి వద్ద ప్రస్తావించగా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. –న్యూస్‌టుడే, సారవకోట



ఇంకా తొలగించలేదు..!



స్థానికంగా గ్రామ సచివాలయం -1 కి నూతన భవనం నిర్మిస్తున్నారు. ఆ నూతన భవనంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం వేసి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 4 నెలలు కావొస్తున్నా.. అధికారులు ఆయన చిత్రం తొలగించకపోవడం విడ్డూరంగా ఉందని తక్షణం ఆయన చిత్రాన్ని తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాజారావు పేర్కొన్నారు.
–న్యూస్‌టుడే, నందిగాం

గోతులతో ఇక్కట్లు

నిత్యం రద్దీగా ఉండే శ్రీకాకుళం రహదారి గ్రామీణ వికాశ్ బ్యాంకు సమీపంలో గోతులమయమైంది. నిత్యం వందలాది వాహనాలు కొత్తూరు - శ్రీకాకుళం మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడ మురుగుకాలువలు లేక నీరు నిలిచిపోవడంతోపాటు భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యపై ఆర్అండ్‌బీ ఏఈ కిరణ్ మాట్లాడుతూ త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు



దుకాణాలు మూత.. ఇళ్లకు తాళాలు



నిర్మానుష్యంగా వనవిష్ణుపురంలోని ఓ వీధి

పోలాకి,న్యూస్‌టుడే: వనవిష్ణుపురం గ్రామంలో ఇటీవల మంగళవారం జరిగిన పి.వీరాస్వామి హత్యతో జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. గ్రామంలో 144 సెక్షన్ అమలు చేశారు. ఇక్కడ 300 కుటుంబాలు ఉండగా ఈ ఘటనతో దుకాణాలు మూసివేయగా, కొన్ని కుటుంబాలు ఊరు విడిచి బంధువుల ఇళ్లకు వెళ్లిపోయాయి. ప్రస్తుతం అంతా ప్రశాంతంగానే ఉందని అదనపు ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు.

రతన్ టాటా ఆదర్శనీయుడు

హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్ఎపేట, న్యూస్‌టుడే: రతన్ టాటా సేవలు మరువలేమని పలువురు తెలిపారు. గురువారం ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. హిరమండలంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.



సౌర విద్యుత్తుతో ప్రయోజనం

నరసన్నపేట, కొత్తూరు, జలుమూరు, న్యూస్‌టుడే: సౌర విద్యుత్తు పథకంతో విద్యుత్తు బిల్లుని ఆదా చేసుకోవచ్చని పాతపట్నం విద్యుత్తు డీఈఈ ఎస్ఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని ఇరపాడు గ్రామంలో సోలార్ విద్యుత్తుపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ★ స్థానిక సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో విద్యుత్తు శాఖ డిప్యూటీ ఈఈ కె.ఇందిర పథకం గురించి వివరించారు. *జలు

ఘనంగా మారువారం ఉత్సవాలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతరమహోత్సవాలు ముగిసిన తదుపరి మారువారం గురువారం అమ్మదర్శనం కోసం భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. 4వేల మంది భక్తులకు రైసుమిల్లర్ల అసోసియేషన్ అన్నప్రసాదాన్ని పంపిణీ చేసింది. కార్యక్రమాన్ని విశ్రాంత అదనపు ఎస్పీ కింజరాపు ప్రభాకరరావు, జిల్లా రైసుమిల్లర్ల సంఘ గౌరవఅధ్యక్షులు ప్రసాదరావులు ప్రారంభించారు.



అవీ..ఇవీ..అన్నీ

మూరు మండలం చల్లవానిపేటలో డీఈఈ కె. విష్ణుమూర్తి మాట్లాడారు.

గాయపడిన వ్యక్తి మృతి



అప్పన్న (పాత చిత్రం)

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండలం బసవరాజుపేట గ్రామానికి చెందిన సిద్ధాంతం అప్పన్న (65) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మంగళవారం రాత్రి స్కాట్‌పేట గ్రామంలోని పాలకేంద్రానికి పాలు తీసుకొని వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. తలకు తీవ్ర గాయం కావడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

పరామర్శ

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని గూనభద్ర గ్రామానికి చెందిన మండల ప్రత్యేక ఆహ్వానితుడు అంపిలి ప్రశాంత్‌కుమార్ తల్లి మృతి చెందారు. గురువారం ఆయనను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరామర్శించారు.

పోటీ పుస్తకాల వితరణ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక శంభానవీధిలోని శాఖాగ్రంథాలయానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జి.మోహనరావు పోటీపుస్తకాలను గురువారం వితరణగా అందజేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ, టెట్ పరీక్షలకు సంబంధించిన కొత్త పుస్తకాలను గ్రంథపాలకురాలు బి.రూపవతికి అందించారు.

స్వయం ప్రతిపత్తిపై హర్షం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తిని కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కోరాడ రాంప్రసాద్ అన్నారు. హిందూ సంప్రదాయాలపై మాట్లాడారు.

ప్రపంచ కళాజాతరకు ఆలితిప్పలు నాటిక

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి ప్రజా చైతన్య కళాసమితి ఆధ్వర్యంలో రూపొందించిన 'ఆలితిప్పలు' నాటికను ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరకు ఎంపిక చేశారు. ఐఎస్‌వో గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ తమకు ఆహ్వానం పంపించినట్లు నాటిక దర్శకుడు డీపీ స్టాలిన్ తెలిపారు. ఈనెల 19న తాడేపల్లిగూడెంలోని బుద్ధాల కన్వెన్షన్ హాలులో నాటిక ప్రదర్శిస్తామని అన్నారు. తనతో పాటు రచయిత, నటుడు మూల తాతయ్య, జానపద కళాకారుడు డాక్టర్ కుమార్ నాయక్, బాలనటుడు గౌడు వేదవ్యాస్ ప్రధాన పాత్రలు పోషిస్తారని చెప్పారు.

రాజేష్ సేవలు చిరస్మరణీయం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: జమ్మూకశ్మీర్ డోడా జిల్లాలో ఉగ్రవాదుల ఎదురు కాల్పుల్లో వీర మరణం పొందిన డొక్కారి రాజేష్ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ అన్నారు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రలో రాజేష్ తల్లి దండ్రులను చిట్టయ్య, పార్వతీలను గురువారం పరామర్శించారు. ప్రభుత్వం పరంగా న్యాయం చేసేందుకు సహకరిస్తానని తెలిపారు.



బాధ్యతల స్వీకరణ

నందిగాం, న్యూస్‌టుడే: నందిగాం తహసీల్దారుగా సోమేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గుడిసెకు మంటలు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం అల్లాడ గ్రామానికి చెందిన గొర్లె వేణు ఇల్లు బుధవారం అర్ధరాత్రి మంటల్లో చిక్కుకుంది. గుర్తించిన కుటుంబ సభ్యులు, స్థానికుల సాయంతో మంటలను అదుపు చేశారు. ప్రమాదం ఎలా జరిగిందన్నది తెలియరాలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ పరిశీలకుడు కిరణ్, వీఆర్వో పరిశీలించారు.

సచివాలయ గోడలపై పనివేళలు తప్పనిసరి

సారవకోట, న్యూస్‌టుడే: సచివాలయ గోడలపై పనివేళలు తప్పనిసరిగా రాయించాలని ఎంపీడీవో మోహన్‌కుమార్ సూచించారు. మండల పరిషత్తు సమావేశ భవనంలో గురువారం సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలో సేవలు అందుతాయన్న విషయాన్ని గోడలపై నమోదు చేయాలన్నారు. పనివేళల్లో సిబ్బంది బయటకు వెళితే ఎందుకు వెళ్లారు, ఎప్పుడు వెళ్లారు వంటి విషయాలను మూమెంట్ పుస్తకంలో నమోదు చేయాలన్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు జరగాలని, పనులకు సంబంధించిన చిత్రాలు పంపించాలన్నారు. ఈవోపీఆర్డీ ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవనం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: నిత్య జీవనంలో ప్రశాంతతకు ఆధ్మాత్మిక విధానమే సరైనదని బెంగళూరుకు చెందిన బ్రహ్మకుమారీ మంజూనాథ్ అన్నారు. జిల్లాలో చాపర త్రిలోక్ భవనంలో ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 27 వరకు ప్రత్యేక చైతన్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తి, మానసిక శక్తి, ధ్యానం, ఆరోగ్యం జీవనానికి కావాల్సిన చైతన్యం, ఆహార నియమావళి తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ అందించడం జరుగుతుందన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి పారిశుద్ధ్యం, ఆర్థిక వనరులైన ఇంటి పన్నులు వసూలు లక్ష్యం సాధించాలని గ్రామాల్లో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ రామకృష్ణ, కార్యదర్శులు అప్పారావు, శివాజీ, ఢిల్లీ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

స.హ. చట్టాన్ని అమలు చేయాల్సిందే


మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టాన్ని అన్ని శాఖల్లో అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. అప్పారావు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆర్టీఐపై సమావేశం నిర్వహించారు. ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఉత్తర్వుల మేరకు భవిష్యత్తులో అప్పీళ్లు, విచారణ వర్చువల్ విధానంలో జరగనున్నాయని తెలిపారు. దరఖాస్తుదారులు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందజేయాలని ఆదేశించారు. నివేదికలను ప్రతి నెల కలెక్టరేట్‌కు నివేదించాలన్నారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్: గొండు


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం తహల్దారు కార్యాలయంలో గురువారం గ్రామీణ మండల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పింఛన్లు, ఇళ్ల నిర్మాణ బిల్లులు, గ్రామాలకు తాగు, సాగునీరు అందించాలని.. వ్యక్తిగత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్దఎత్తున వినతిపత్రాలు అందజేశారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వ్యాఖ్యానించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: పంచాయతీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని రణస్థలంలో ఉపాధిహామీ నిధులతో నిర్మించి వెల్‌నెస్ సెంటర్‌ను, స్థానిక సర్పంచి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు పిన్నింటి వెంకట భానోజీనాయుడు సుమారు రూ.5 లక్షల సొంత నిధులతో నిర్మించిన బస్సు షెల్టర్, బృందావన్ గార్డెన్‌లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.

గర్భిణులకు అమృతాహారం


భోజనం చేస్తున్న గర్భిణులతో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

ఎచ్చెర్ల, బూర్జ, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా దివ్య అనుగ్రహంతో జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పీహెచ్‌సీలకు పరీక్షలకు వచ్చే గర్భిణులకు సత్యసాయి సేవా సంస్థలు అమృతాహారాన్ని అందిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు అన్నారు. ఎచ్చెర్లలోని పీహెచ్‌సీలో గురువారం తనిఖీలకు వచ్చిన గర్భిణులకు అమృతాహారం అందజేశారు. వైద్యురాలు ఎం. ఉషశ్రీ, సత్యసేవా సంస్థల జోనల్ కన్వీనర్ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు. ● బూర్జ మండల కేంద్రంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తనిఖీ కోసం వచ్చిన గర్భిణులకు సభ్యులు సత్యసాయి అమృతాహారం పేరుతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా 35 మందికి పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించినట్లు కన్వీనర్ బి.రామారావు తెలిపారు.

దుర్గమ్మా.. నమోస్తుతే

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని పలు దేవాలయాలు, మందిరాలు, పీఠాల్లో భక్తులు దుర్గాదేవికి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం


కాకివీధి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో..


జి.సిగడాం: దవళపేటలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పాత శ్రీకాకుళం ఏపీహెచ్‌బీ కాలనీ చిన్మయ మిషన్‌లో బొమ్మల కొలువు

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేశారు

న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు బాధితుల వినతి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి రూ.లక్షలు వసూలు చేసుకొని తమను మోసం చేశారనని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు కళ్యాణదుర్గం ప్రజావేదిక వద్దకు చేరుకొని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో తమ బాధను చెప్పుకొన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు ఇప్పిస్తామని 2022లో మమత (మదనపల్లి), అనిత (శ్రీకాకుళం), అవినాష్‌రెడ్డి (తిరుపతి), ఈశ్వర్ (విజయవాడ) అనే వ్యక్తులు తమను విజయవాడకు పిలిపించారన్నారు. తమ నుంచి సుమారు రూ.32 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. రెండేళ్లుగా వారి చుట్టూ తిరుగుతున్నా ఉద్యోగాలు ఇప్పించలేదని, డబ్బు తిరిగి ఇవ్వలేదని వాపోయారు.

అవీ..ఇవీ..అన్నీ

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కాలువలో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. అతనికి సుమారు 50 సంవత్సరాల వయసు ఉంటుందని రెండో పట్టణ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు.

దంతపురిలో అన్నసంతర్పణ

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని దంతపురిలో సోమాలమ్మ అలయం వద్ద గురుస్వామి, ఆలయ ధర్మకర్త మెండ సూర్యారావు ఆధ్వర్యంలో గురువారం భవానీ భక్తులు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కొండవలస, పెద్దపాలెం, చిన్నపాలెం, రావివలస, మునగవలస, రొట్టవలస, పాలవలస, పెద్ద వెంకటాపురం, తదితర గ్రామాలకు చెందిన 5 వేల మందికి అన్నసంతర్పణ చేశారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం సర్వజనాసుపత్రి సత్యసాయి అన్నదాన ప్రాంగణంలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహించారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు డా.బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. డా.పొన్నాడ శేషుబాబు, లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, మానవత సంస్థ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, గుత్తు చిన్నారావు, దేవభూషణరావు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని బెహర మనోవికాస కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. గేదెల ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిర్డీ సాయికి ప్రత్యేక పూజలు

న్యూస్‌టుడే, గార: గారలో గురువారం శిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ధర్మకర్త కొన్న వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాద వితరణ జరిగింది. సర్పంచులు మార్పు పృథ్వీరాజ్ (గార), కొంక్యాణ ఆదినారాయణ (శాలిహుండం), మార్పు ధర్మారావు, పూడి బాలాదిత్య, శిర్డీ సాయి సేవకులు, స్థానికులు పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని గ్రామ సర్పంచి ఎన్ని రామచంద్రరావును అధికారులను కోరారు. గురువారం ఆమదాలవలస మండలం కట్యాచార్యులపేట గ్రామంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు సుధాకర్ నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో రెండు గ్రామాలు ఉన్నాయని, ప్రతి కూలీకి 100 రోజుల పని కల్పించాలని అన్నారు. అధికారులు, గ్రామస్థులు, కూలీలు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన తులసి



బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని కురుంపేటకు చెందిన ఎస్.తులసి సౌత్ జోన్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన రేస్‌వాల్ పోటీలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పీఈటీ ఇ.అప్పన్న తెలిపారు. అదేవిధంగా ఈ నెల ప్రారంభంలో తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి రేస్‌వాల్ పోటీలో ద్వితీయ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. ఈమె పదో తరగతి వరకు మండలంలోని కేకేరాజపురం ఉన్నత పాఠశాలలో చదివింది. ప్రస్తుతం పాలకొండలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నట్లు తెలిపారు.

అభివృద్ధి అన్నారు.. గాలికొదిలేశారు!

అసంపూర్తి రోడ్డుతో రాకపోకలకు అవస్థలు

న్యూస్‌టుడే, గార, గుజరాతీపేట

గార మండల పరిధి వమరవల్లి పంచాయతీ హుకుంపేట గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులను వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది. తెదేపా హయాంలో సీఎస్పీ రహదారి నుంచి హుకుంపేట మీదుగా వమరవల్లి గ్రామానికి సుమారు 1.2 కి.మీ. మేర రోడ్డు అభివృద్ధికి 2018లో ఉపాధి హామీ పథకం కింద రూ.1.10 కోట్లు మంజూరయ్యాయి.


రాళ్లు తేలిన హుకుంపేట రహదారి

సకాలంలో బిల్లులు చెల్లించక..

90 శాతం పనులు పూర్తయ్యాయి. సాంకేతిక సమస్య కారణంగా సకాలంలో బిల్లు చెల్లించకపోవడం.. పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనా విలువ లేకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. వైకాపా హయాంలో రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలంటూ గ్రామస్థులు, స్థానిక పెద్దలు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదు.

మడమ తిప్పిన ధర్మాన

2022 జూన్ 4న వమరవల్లి గ్రామ సచివాలయ భవన ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు కాన్వాయ్‌ను ఎంపీటీసీ సభ్యురాలు సుగ్గు లక్ష్మీనృసింహదేవి ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆపారు. రహదారి సమస్య పరిష్కరించి ప్రయాణికుల విశ్రాంతి భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ధర్మాన మాట్లాడుతూ సిమెంట్ రోడ్డు నిర్మించేలా చూస్తామని..ఏడాది లోపు ప్రయాణికుల భవనం పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. 2023 అక్టోబరు 4న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన వమరవల్లి వచ్చారు. నవంబరు చివరి వారం నాటికి హుకుంపేట రహదారి పనులు పూర్తి చేయిస్తామని పునరుద్ఘాటించారు. విశ్వసముద్ర గుత్తేదారుతో మాట్లాడానని..పనులు పూర్తి చేయిస్తానని స్పష్టం చేశారు. వైకాపా ప్రభుత్వ పాలనా కాలం ముగిసినా గ్రామస్థుల వెతలు తీరలేదు. కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై మండల ఇంజినీరు పి.గోవిందరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా రహదారి సమస్యను ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

పంటల సాగులో యాంత్రీకరణ అవసరం


డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: ప్రస్తుతం పంటలు సాగు చేస్తున్న రైతులకు కూలీల కొరత, వాతావరణ ప్రతికూల పరిస్థితులు వంటికి అడ్డంకిగా మారుతుండటం వల్ల యాంత్రీకరణ అవసరం ఎంతో ఉందని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఇస్కలపాలెం గ్రామంలో ఆత్మా ఆర్థిక సౌజన్యంతో డ్రోన్‌తో మందుల పిచికారీపై గురువారం ప్రదర్శన క్షేత్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన పంటయైన వరిలో యాంత్రీకరణను కృషి విజ్ఞాన కేంద్రం ప్రోత్సహిస్తుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష కూడా మాట్లాడారు. అనంతరం పొలాల్లో డ్రోన్‌తో ఏవిధంగా పిచికారీ చేయాలో ప్రదర్శన నిర్వహించారు. మత్స్యశాఖ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.బాలకృష్ణ, సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, ఎస్సార్ఎఫ్ నిక్రా డాక్టర్ పి.హేమలత, ఉప వ్యవసాయ సంచాలకులు వెంకటరావు, సరుబుజ్జిలి మండల వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం, ఏడీఏ రాజగోపాలరావు, రైతులు పాల్గొన్నారు.

నేడు తపాలా కార్యాలయంలో ఆధార్ మేళా

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: తపాలా వారోత్సవాల సందర్భంగా శ్రీకాకుళం ప్రధాన తపాలా కార్యాలయంలో శుక్రవారం ఆధార్ మేళా నిర్వహించనున్నట్లు పోస్ట్‌మాస్టర్ భానుజీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ నవీకరణ, ఇతర సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

కార్యవర్గ ఎన్నిక

బూర్జ, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణ సంఘం బూర్జ మండల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగినట్లు గురువారం తెలిపారు. సంఘ అధ్యక్షుడిగా బలగ వెంకటలింగరాజు, ప్రధాన కార్యదర్శిగా కటకం రాజేశ్వరరావు పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు.


గుడ్లు, పౌష్టికాహారం అందజేస్తున్న విభూతి సూరిబాబు

చిన్నారులకు తల్లి పాలే శ్రీరామరక్ష

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: చిన్నారులకు తల్లి పాలే శ్రీరామ రక్ష అని తెదేపా 31వ వార్డు వార్డు ఇన్‌ఛార్జి విభూతి సూరిబాబు అన్నారు. దండి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, గుడ్లు పంపిణీ చేశారు. సీడీపీవో శోభారాణి, సూపర్‌వైజర్ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

కొర్లకోట వాసి ప్రతిభ



ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొర్లకోటకు చెందిన పేడాడ హిమశ్రీ తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల విడుదలైన డీఎస్సీ సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష ఫలితాల్లో 9వ ర్యాంకు సాధించింది. 1 నుంచి ఇంటర్ వరకు ఆమదాలవలస, శ్రీకాకుళంల్లోని ప్రైవేటు విద్యాలయాల్లో చదివింది. బీఎస్సీ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో, శ్రీకాకుళంలోని వమరవెల్లి డైట్‌లో చదివారు. తెలంగాణ రాష్ట్రం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో 9వ ర్యాంకు సాధించింది. ఈమెకు తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోస్టింగ్ పత్రాలు అందజేశారు. తల్లి సాయిలక్ష్మి గృహిణి కాగా, తండ్రి ప్రభాకరరావు సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుమల బ్రహ్మోత్సవాల్లో శ్రీకాకుళం నగరంలోని అభినయ నృత్యనికేతన్ సంస్థ వ్యవస్థాపకురాలు డా.తిమ్మరాజు నీరజాసుబ్రహ్మణ్యం శిష్య బృందం నృత్య ప్రదర్శన అలరించింది. ఆలయ మాడ వీధుల్లో గురువారం వెంకటేశ్వరస్వామి వైభవం నృత్య రూపకాన్ని నర్తించి ఆకట్టుకున్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం



వైద్యానికి ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న ఆబ్కారీ శాఖ సహాయ కమిషనర్ అనసూయదేవి

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న బి.సునీల్‌కుమార్ కుమారుడు అనారోగ్యానికి గురికావటంతో శస్త్ర చికిత్సకు ఖర్చు ఎక్కువ కావడంతో స్థానిక డా. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ పరిశ్రమ స్పందించి రూ.50 వేల చెక్కును సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా అందజేశారు. ఈ మేరకు విజయవాడలోని రాష్ట్ర ఆబ్కారీ శాఖ కార్యాలయంలో జాయింట్ కమిషనర్ అనసూయదేవి చేతుల మీదుగా గురువారం సునీల్‌కుమార్‌కు చెక్కు అందజేశారు. పరిశ్రమ లైజనింగ్ అధికారి జి.ప్రసాద్, సీఎస్ఆర్ విభాగం ప్రతినిధులు కె.వి.ఎస్.ఎన్.రాజు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన **కూరాకుల శ్రీనివాసరావు**, గుడి వీధి, శ్రీకాకుళం, IIIrd అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి (Pro @ Excise) వారి కోర్టు O.S. No: 373/2024, I.A. No: 285/2024 ఇంజంక్షన్ దావా వేసి ఈ దిగువన ఉదహరించిన షెడ్యూలు ఆస్థిని, ప్రతివాది అయిన **ఇనపకుర్తి ఆనందరావు** S/o. **సూర్యనారాయణ**, అరసవిల్లి వాస్తవ్యులు వారిచే ఇతర వ్యక్తులకు అమ్ముటకు గాని, అగ్రిమెంట్ చేయుటకు గాని వీలు లేదని ఇంజంక్షన్ దావా పొందియున్నారు. కాని పై సదరు వ్యక్తి అయిన ఇనపకుర్తి ఆనందరావు తప్పుడు దస్తావేజులను సృష్టించి ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని అమ్మజేయునట్టుగా తెలిసింది. కనుక ప్రతివాది ఇనపకుర్తి ఆనందరావు అమ్మచూపిన ఏ ఇతర వ్యక్తులు గాని, సంస్థలకు గాని కొనుటకు చట్టరీత్యా చెల్లనేరవని, ఆ కొన్న వారిపై నా క్లయింట్ తీసుకోబోయే సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులు అవుదురు అని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు ఆస్థి వివరములు: Item No:1: కలెక్టరు ఆఫీసు రోడ్డులో తూర్పు శ్రేణిలో గల పాత శ్రీకాకుళం వార్డు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో గల T.S. No. 414-1, R.S. No: 496-1 లో గల 0.08 సెంట్లు ఖాళీ స్థలమునకు **హద్దులు: తూర్పు:** రాకోటి భూలక్ష్మి గారి పల్లం భూమి, **దక్షిణం:** రాకోటి భూలక్ష్మి గారి పల్లం భూమి, **పడమర:** 80'-00 Feet Road, **ఉత్తరం:** ఈ షెడ్యూలులో గల Item No:2.

Item No:2: కలెక్టర్ ఆఫీసు రోడ్డులో తూర్పు శ్రేణిలో గల పాత శ్రీకాకుళం వార్డు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో గల T.S. No. 414-1, R.S. No: 496-1లో గల 0.08 సెంట్లు ఖాళీ స్థలమునకు **హద్దులు: తూర్పు:** రాకోటి భూలక్ష్మి గారి పల్లం భూమి, **దక్షిణం:** ఈ షెడ్యూలులో గల Item No:1, **పడమర:** 80'-00 Feet Road, **ఉత్తరం:** క్షత్రియ దులత్‌రామ సింగ్ గారి పల్లం భూమి మరియు నీరు పారే బట్టి.

K.V.CHALAPATHI RAO B.A.,B.A.,LL.B,
ADVOCATE, Reddika Street, 16-11-112,
Fazulbegpeta, Srikakulam. Cell: 7013866220